ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
జగిత్యాల జిల్లా వార్తలు
5★★
మంగళవారం 17 జూన్ 2025

జిల్లాలోని ఆసుపత్రుల వివరాలు..	
జనరల్ ఆసుపత్రి	1
పీహెచ్‌సీలు	17
సబ్ సెంటర్లు	151
24గంటలు పనిచేసే పీహెచ్‌సీలు	7
ఆర్‌బీఎస్‌కే బృందాలు	10
పల్లె దవాఖానాలు	102
బస్తీ దవాఖానాలు	5
యూపీహెచ్‌సీలు	5
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	3
సామాజిక బోధన ఆసుపత్రి	1
మాతా శిశు సంరక్షణ కేంద్రం	1

జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్‌లో మురికి కాలువలో ద్రావణాన్ని పిచికారి చేస్తున్న సిబ్బంది



సంవత్సరం	మలేరియా	డెంగ్యూ	చికున్‌గున్యాకేసులు
2022	0	309	0
2023	2	110	0
2024	0	292	2
2025	0	1	0

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం..



పరిసరాలను పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

- కలెక్టర్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్
- డీఎంహెచ్‌వో కార్యాలయంలో హెల్ప్ డెస్క్
- పరిసరాల పరిశుభ్రత పాటించాలంటున్న వైద్యులు

జగిత్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అప్పుడే ఎండ..కాసేపటికి వాన... మరికొంత సమయం గడిస్తే ఈదురు గాలులు.. ఇలా ఒకేరోజు జిల్లాలోని పలు ప్రాంతాల్లో భిన్నమైన వాతావరణం నెలకొంటోంది. వాతావరణంలో అసమతుల్యం కారణంగా వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉంటేనే వ్యాధులు దూరంగా ఉండే అవకాశాలున్నాయని వైద్యులు సూచిస్తున్నారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించడం, పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచడం, తాగునీటి కలుషితాన్ని నివారించడం, ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించడం వంటి చర్యలతో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. గతంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.

●కలుషిత నీరు, దోమల నివారణపై దృష్టి

సీజనల్ వ్యాధులు ప్రధానంగా కలుషిత నీరు తాగడం, దోమల కాటుతోనే సంక్రమిస్తాయి. దీంతో జిల్లా అధికారులు ఈ రెండు అంశాలపై దృష్టి సారించారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. ఈ నీటిని తొలగించేందుకు ప్రతీ శుక్రవారం డ్రైడే పాటిస్తూ, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలను కోరుతున్నారు. వేడి ఆహారం తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కూలర్లు, కొబ్బరి బోండాలు, టైర్లు, పూల కుండీలు, డ్రమ్ముల్లో నీరునిల్వ ఉండకుండా చూడాలని అధికారులు పేర్కొంటున్నారు.

●వేగంగా పరీక్షలు..

తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ ద్వారా ప్రతీ ఆరోగ్య కేంద్రం పరిధిలో రక్త నమూనాలను సేకరించి, టీహబ్ వాహనం ద్వారా పరీక్షల కోసం తీసుకెళ్తున్నారు. పరీక్ష ఫలితాలను సంబంధిత వ్యక్తి మొబైల్‌కు సందేశం రూపంలో పంపిస్తున్నారు. దీంతో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులను త్వరగా నిర్ధారించి వెంటనే చికిత్స అందించే అవకాశం ఏర్పడింది. జ్వర బాధితులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకుంటోంది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరిపడా మందులు, బెడ్లు అందుబాటులో ఉంచారు.

● ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు ఏర్పాటు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఎపిడెమిక్ సెల్ లాంటి ర్యాపిడ్ రెస్పాన్స్ టీంను ఏర్పాటు చేశారు. ఆరోగ్య సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు 8500434042 నంబర్‌ను అందుబాటులో ఉంచారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇబ్బందులు ఎదురైనా ఈ నంబర్‌లో సంప్రదించి సలహాలు పొందవచ్చు. మండలాల వారీగా ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను....

మిగతా 8లో

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. జిల్లాలో ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 3,861మంది పరీక్షకు హాజరవగా, 2573 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఇంటర్మీడియేట్ జిల్లా నోడల్ అధికారి నారాయణ తెలిపారు. ప్రథమ సంవత్సరం వొకేషనల్ విభాగంలో 369మంది పరీక్షకు హాజరవగా, 238 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 2074 మంది విద్యార్థులకు గానూ 1134మంది ఉత్తీర్ణత సాధించగా, వొకేషనల్ విద్యార్థులు 325మందికి గానూ, 203మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు నారాయణ తెలిపారు. ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 66.64శాతం ఉత్తీర్ణత రాగా, వొకేషనల్ విభాగంలో 64.5శాతం, ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 54.68శాతం, వొకేషనల్ విభాగంలో 62.46 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

●ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో నవ్య బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్ తెలిపారు. ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో గుమ్ముల రోహిత 466/470మార్కులు, బోరగల్ల హంసిక 465/470, బైపీసీ ఫస్ట్ ఇయర్ విభాగంలో సాంబారి హిమవర్షిణి 433/470, గంప అక్షిత 430/470 మార్కులు సాధించారని తెలిపారు.

సత్వర న్యాయం జరిగేలా చర్యలు

● ఎస్పీ అశోక్ కుమార్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) :ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 18మంది అర్జీదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మల్యాల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజికల్ డైరెక్టర్ అతిథి అధ్యాపక సిబ్బంది నియామకంకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మానస తెలిపారు. ఆసక్తి, అనుభవం కలవారు తమ బయోడేటాను పాఠశాలలో అందించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9866559701 నంబర్‌లో సంప్రదించాలని అన్నారు.

'విత్తనాల తయారీలో నాణ్యత పాటించాలి'



మంత్రి తుమ్మలను కలిసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల,జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విత్తనాల తయారీలో నాణ్యత పాటించేలా కంపెనీలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ కోరారు. సోమవారం హైద్రాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నియోజకవర్గంలోని జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ సీడ్ ప్రాసెస్‌యూనిట్ మంజూరై చాలా సంవత్సరాలు గడుస్తుందని, యూనిట్ పాత బకాయిలు త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. ఇందుకు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. ఈకార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్, తదితరులు ఉన్నారు.

మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన ఎమ్మెల్యే

రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రిగా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వాకిటి శ్రీహరిని సోమవారం హైదరాబాద్‌లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సచివాలయంలో మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

'పంట మార్పిడితో అధిక దిగుబడులు'



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

రాయికల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పంట మార్పిడి విధానంతో రైతులు అధిక దిగుబడులు సాధించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి అల్లీపూర్ గ్రామంలో రైతు వేదిక నుంచి కలెక్టర్ సత్యప్రసాద్ హాజరయ్యారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి సీఎం 1034 రైతు వేదికలో నూతనంగా రైతునేస్తం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇతర మంత్రులు, సీఎస్ రామకృష్ణారావులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల ఆశీర్వాదం లేకపోతే ప్రజాప్రతినిధిగా రాణించలేమన్నారు. గ్రామ, వార్డు సభ్యుల నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రతిఒక్కరికీ రైతుల సహకారం అవసరమని అన్నారు. గత పాలకులు నాలుగు విడతల్లో రూ.లక్ష రుణమాఫీ చేస్తే రైతులకు మిత్తి మాత్రమే మాఫీజరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి రైతుల ధాన్యం కొనలేని పరిస్థితి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించని దుస్థితిలో రాష్ట్రం ఉండే దన్నారు. గత పాలకులు వరి వేస్తే ఉరి అనే స్థితికి తీసుకుని వచ్చారని అన్నారు. సోలార్ పంప్‌సెట్ వల్ల ప్రయోజనాలు, లాభసాటి పంటల సాగుపై సీనియర్ రైతులతో రైతు వేదికలలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు జరపాలని అన్నారు. పంట మార్పిడి వ్యవస్థ తప్పని సరిగా రావాలని ఆయన సూచించారు. జొన్నరొట్టె తింటే మన ఆరోగ్యం బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డిప్యూటీ జడ్పీ సీఈవో నరేష్, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీవో చిరంజీవి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయికల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్ 33 కేవీ లైన్‌లో చెట్ల కొమ్మల తొలగింపు దృష్ట్యా మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జగిత్యాల రూరల్ ఏడీఈ సింధూర్‌శర్మ తెలిపారు. ఒడ్డెలింగాపూర్, ఇటిక్యాల, తాట్లవాయి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్

రాయికల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలానికి సంబంధించిన స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ బుధవారం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి రాఘవులు తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఫారంతో 18వ తేదీన ఉదయం 9:30 గంటలకు రిపోర్ట్ చేయాలన్నారు. మిగతా వివరాలకు పీడీ కృష్ణప్రసాద్‌ను 9440037393 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పాఠశాలలో వైద్య శిబిరం

రాయికల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి కంటి ఆస్పత్రి వైద్యులతో రాయికల్ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 138 మందికి కంటి పరీక్షలు చేయగా 56 మందిని ఆపరేషన్ కోసం గుర్తించి రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్ లయన్ మోర హన్మాండ్లు అన్నారు. అనంతరం శ్రీని ల్యాబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేకర్, మాజీ జడ్‌సీలు మ్యాకల రమేష్, బత్తిని భూమయ్య పాల్గొన్నారు.

'కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి'



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మల్లాపూర్, జూన్, 16 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు మంత్రిసీతక్కకు కోరారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రిని కార్యదర్శుల జేఏసీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లాపూర్ మండలంలోని పంచాయతీల్లో పాలకవర్గం గడువు పూర్తయినప్పటి నుంచి గ్రామాల్లో అభివృద్ధి పనులు, గ్రామపాలన కొనసాగించడానికి, పంచాయతీ ట్రాక్టర్లకిస్తీలు, నిర్వహణ, కార్మికుల వేతనాలు చెల్లించడానికి నిధులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరగా సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి మరల్చేందుకే ఏసీబీ విచారణతో హడావుడి
● బీఆర్ఎస్ లోపాలు అంతర్గతంగా సవరించుకుంటాం
● నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
7
పురుగుల మందు డబ్బాలతో ప్రజావాణికి రైతులు
● చెరువు భూమిని కాపాడాలని డిమాండ్
6

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో వాణిశ్రీ

బీర్‌పూర్,జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాలు పూర్తి అయిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని ధర్మపురి సీడీపీవో వాణిశ్రీ అన్నారు. సోమవారం బీర్‌పూర్ మండలంలోని రేకులపెల్లి గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ కిచెన్ పరిసరా ప్రాంతాలలో గార్డెన్స్ పెంచాలని అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. అంగన్‌వాడీ పాఠశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి చిన్నారులను చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను రూపుదిద్దడానికి ప్రభుత్వం అన్ని వసతులు ఏర్పాటు చేస్తుందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్స్ తాగు నీటి సౌకర్యం, కరెంట్ సౌకర్యం, స్కూల్ మెటీరియల్ యూనిఫామ్స్ అందించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగభూషణం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శైలజ, అంగన్‌వాడీ టీచర్లు రేవతి, సుమలత ఉన్నారు.

దివ్యాంగుల ఉపకరణాల దరఖాస్తుకు హెల్ప్ డెస్క్

● జిల్లా సంక్షేమ అధికారి నరేష్

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ఉపకరణాల దరఖాస్తుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు జిల్లా సంక్షేమ అధికారి డా. భోనగిరి నరేష్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వికలాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సంక్షేమ శాఖ ద్వారా వికలాంగులకు ఉపకరణాల మంజూరు చేపట్టారన్నారు. అర్హత కలిగిన వికలాంగులు ఈనెల 18లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేయుటకు కలెక్టర్ కార్యాలయంలోని రూం.నెం.7లో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కావున అవసరం ఉన్న దివ్యాంగులు వారి ధృవపత్రాలతో వచ్చి లేదా పంపించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

'ఆర్టీసీ ప్రయాణం సురక్షితం'

మల్లాపూర్, జూన్, 16 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని మెట్‌పల్లి డిపో మేనేజర్ దేవరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని ముత్యంపేట గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ లాంటి దూర ప్రయాణాలకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, లగ్జరీ బస్సులలో ప్రయాణం చేస్తే కేవలం రూ.400 నుంచి 500 వరకు టికెట్ ఖర్చు అవుతుందన్నారు. నూతనంగా ఖానాపూర్ నుండి ఉదయం 5 గంటలకు మెట్‌పల్లి, ఆర్మూర్ మీదుగా హైదరాబాద్‌కు లగ్జరీ బస్సును ప్రారంభించామన్నారు. ప్రయాణికులు ఇట్టి బస్సు సౌకర్యంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'



పల్లె దవాఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వధ్యేయమని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు అంగన్‌వాడీ కేంద్రాలే పునాదులని ఆయన పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దూలూరు, గంభీర్‌పూర్, సిరికొండ గ్రామాల్లో రూ.36 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలు, భూషణరావుపేటలో రూ.20లక్షలతో నిర్మిస్తున్న పల్లె దవాఖానా పనులకు భూమి పూజ చేసిన అనంతరం మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందుతుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. సూరమ్మ చెరువు పనులను శరవేగంగా పూర్తి చేసి ఈ వర్షాకాలంలో నీటిని నిల్వ చేసి రైతుల కలలను సాకారం చేస్తున్నామని తెలిపారు. పల్లె దవాఖానా నిర్మాణంకు భూమి విరాళంగా అందించిన గడ్డం భూమారెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూండ్ర నారాయణ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పులి శిరీషహరిప్రసాద్, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, ఏఎంసీ డైరెక్టర్ వాకిటి రాజరెడ్డి, గడ్డం స్వామిరెడ్డి, చిన్నారెడ్డి, ఎగ్యారపు శ్రీహరి, ఎంపీడీవో శంకర్‌నాయక్ ఉన్నారు.

తుమ్మల చెరువులోకి రాళ్లవాగు ప్రాజెక్ట్ నీరు

కోనాపూర్ శివారులో ఉన్న రాళ్ళవాగు ప్రాజెక్ట్‌నీరు భూషణరావుపేట తుమ్మల చెరువుకు వస్తుండడంతో సోమవారం ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పరిశీలించారు. కాలువలో పేరుకు పోయిన చెట్లు, కుడి కాలువకు పడ్డ గండిని పూడ్చడంతో చెరువుకు నీరు చేరుతోందని దీంతో రైతులకు, గ్రామంలో భూగర్భజలాలు పెరగడానికి అవకాశం చిక్కిందని విప్ ఆదిశ్రీనివాస్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ వాకిటి రాజరెడ్డి, కాయితి నాగరాజు, గడ్డం స్వామిరెడ్డి, గడ్డం చిన్నారెడ్డి, తలారి మోహన్, లింగారావు, మల్లేశం, పంచాయతీ కార్యదర్శి గఫూర్ ఉన్నారు.

పిల్లలు పుట్టడం లేదని మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

సైదాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకునూర్ గ్రామంలో తేజస్విని(26) అనేవివాహిత సంతానం కావడం లేదని మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాలజిల్లా జగిత్యాల మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కోడిపెల్లి లక్ష్మి-కిషన్‌ల కూతురు తేజస్విని కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఆకునూర్ గ్రామానికి చెందిన జెల్ల సతీష్‌కు ఇచ్చి 2020లో వివాహం జరిపించారు. అప్పుడప్పుడు తేజస్విని తనకు పెళ్లై 5సంవత్సరాలు అవుతున్నా సంతానం కావడం లేదని బంధువులకు చెబుతూ బాధపడేది. పిల్లలు పట్టడం లేదని మనోవేదనకు గురై ఈనెల 13న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు తేజస్వినిని జమ్మికుంటలోని ఓప్రైయివేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేపించారు. మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందినట్లు వారు తెలిపారు. మృతురాలి తల్లి కోడిపెల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైదాపూర్ ఎస్సై తిరుపతి తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

జమ్మికుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అప్పు ఇచ్చిన వ్యక్తి ఇంటి మీదకు వచ్చి ఇష్టం వచ్చినట్లు దూషించడంతో అవమానభారంతో మందు గోళీలు వేసుకొని ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుర్గా కాలనీకి చెందిన పకిడే రవి అనేవ్యక్తి సల్ల రాజమ్మ దగ్గర అవసరం నిమిత్తం రూ.70వేలు అప్పుగా తీసుకున్నాడు. రాజమ్మ భర్త సమ్మయ్య సోమవారం అప్పుతీసుకున్న రవి ఇంటిమీదకు వచ్చి డబ్బులు ఎప్పుడు ఇస్తావంటూ నానా బూతులు తిట్టాడు. పరువు పోయిందని భావించిన రవి భార్య కవిత ఇంట్లో ఉన్న మందు గోళీలు(టాబ్లెట్స్) అన్ని ఒకేసారి మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి కుమారుడు మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమ్మయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

ఉరివేసుకుని ఒకరి బలవన్మరణం

కోరుట్ల రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కోరుట్లరూరల్ మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన అగ్గ ఆశన్న(59) అనేవ్యక్తి ఆదివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు, పోలీసులు తెలిపారు. ఆశన్నకు సంతానం లేకపోవడంతో పాటు భార్య మల్లుతో కుటుంబ కలహాలు రావడంతో కొంతకాలంగా ఆమె రాయికల్‌లో తల్లి గారి ఇంట్లో ఉంటోంది. దీంతో ఆశన్న మద్యానికి బానిసై ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కోరుట్ల పోలీసులకు సమాచారం అందించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్జాలో కరీంనగర్‌వాసి మృతి


ఖాజా మెహరాజ్(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డ ప్రాంతానికి చెందిన ఖాజా మెహరాజ్(46) ఆదివారం రాత్రి షార్జాలో మృతి చెందాడు. ఖాజా ఎనిమిదేళ్లుగా షార్జాలో అల్‌ఖైరిన్‌బాయ్స్‌పాఠశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం కరీంనగర్ నుంచి ఆయన కుటుంబసభ్యులు ఫోన్‌చేసినా స్పందించకపోవడంతో అక్కడేఉన్న వారిబంధువులకు సమాచారం అందించారు. బంధువులు ఆయన గదికి వెళ్లి చూడగా మంచంపై విగతజీవిగా పడి ఉన్నాడు. గుండెపోటుతో మరణించినట్లు కుటుంబసభ్యులు భావిస్తున్నారు. మెహరాజ్‌కు భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

గంజాయి పట్టివేత..ముగ్గురి అరెస్ట్

తిమ్మాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎండీ పోలీసులు గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను పట్టుకొని సోమవారం సాయంత్రం మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ సీఐ మాట్లాడుతూ ఈనెల15నసాయంత్రం 5గంటలకు మండలంలోని కొత్తపల్లి గ్రామఎక్స్‌రోడ్డు వద్ద ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారన్నారు. ఆసమయంలో ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై కరీంనగర్ వైపునకు వస్తుండగా వారిని ఆపి తనఖీ చేశారు. ఈ తనిఖీల్లో వారివద్ద ఉన్న బ్యాగులో 5కిలోల గంజాయి లభించింది. గంజాయితో దొరికిన నిందితులలో వేములవాడ మండలం, నాగయ్యపల్లి గ్రామానికి చెందిన గొంటి నగేష్(19), కోనరావుపేట మండలం, మట్టిమల్ల గ్రామానికి చెందిన చెప్యాల సాత్విక్(19), వేములవాడ అర్బన్ కాలనీకి చెందిన కుత్తడి భరత్(19) ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ సదన్ కుమార్ తెలిపారు.

ఒడిస్సా నుంచి గంజాయి: గంజాయి తాగడానికి బానిసై పోలీసులకు దొరికిన ముగ్గురు జల్సాలకు అలవాటు పడ్డారు. గంజాయి కొనుగోలు చేసి అనంతరం ఎక్కువ ధరకు విక్రయించి డబ్బులు సంపాదించాలనుకున్నారు. గంజాయి ఎక్కడ దొరుకుతుందో తెలుసుకొని నాలుగు రోజుల క్రితం బైక్‌పై ఒరిస్సాకు వెళ్లి అక్కడ గంజాయిని కొనుగోలు చేసి తిరిగి వస్తున్నారన్నారు.



ఇంటింటింకీ ఇంటర్నెట్ ఇంకెప్పుడు?

- అసంపూర్తిగా టీ-ఫైబర్ పనులు
- గ్రామ పంచాయతీల్లో అందని ఈ-సేవలు
- నెట్ సౌకర్యం లేక అభివృద్ధికి నోచుకోని గ్రామాలు

భగత్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి ఇంటర్‌నెట్ సౌకర్యం ప్రశ్నార్థకంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం అందించాలన్న లక్ష్యంతో ప్రారంభించిన టీ-ఫైబర్ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. గ్రామాల్లో సత్వర సేవలు, పరిపాలన సౌలభ్యం కోసం పంచాయతీ కార్యాలయాలతో పాటు, ప్రతి ఇంటికి ఇంటర్‌నెట్ సేవలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. 2015 సంవత్సరంలో ప్రారంభమైన పనులు 2022 నాటికే పూర్తి కావాల్సి ఉన్నా నిధుల కొరత, అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. ఏళ్లు గడుస్తున్నా గ్రామీణ ప్రాతాల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడంలేదు.


ఇంటర్‌నెట్ కోసం కొత్తపల్లి మండలంలో వేసిన పైపులైన్

పైప్‌లైన్‌తోనే సరి...

జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో 313 గ్రామ పంచాయతీలు ఉండగా, గ్రామాల్లో ఇంటింటికి 20 ఎంబీపీ ఎస్, విద్యాలయాలు, పంచాయతీ కార్యాలయాలకు ఒక జీబీపీఎస్ కనీస వేగంతో బ్రాడ్ బ్యాండ్ సేవలను తక్కువ ధరలకే అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ పథకం భారత్‌నెట్‌లో భాగంగా అన్ని గ్రామ పంచాయతీలను కలుపుతూ మిషన్ భగీరథ పైపులైన్‌తోపాటు అండర్ గ్రౌండ్‌లో ఫైబర్ ఆప్టికల్ కేబుల్ (ఓఎఫ్‌సీ) నిర్మాణ పనులు చేపట్టారు. మండల కేంద్రాల్లో ఆప్టికల్ లింక్ సెంటర్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి గ్రామాలను అనుసంధానం చేశారు. గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు ఉన్న చోట ఎంఐ బాక్సులు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సోలార్ ఇన్వర్టర్లు ఏర్పాటు చేశారు. పెండింగ్ పనులను నిలిచిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా ఇంటర్‌నెట్ కనెక్షన్లు అందుబాటులోకి రావడం లేదు. విస్తృత ప్రయోజనాలు ఉన్న ప్రాజెక్టు పనులు పూర్తి చేసి గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సేవలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

మాన్యువల్‌గానే పనులు

గ్రామ పంచాయతీల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం లేకపోవడంతో ఇప్పటికీ కార్యకలాపాలు మాన్యువల్‌గానే సాగుతున్నాయి. గ్రామానికి సంబంధించిన ఏదైనా సమాచారం కావాలంటే రికార్డులు వెతకాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వివిధ అనుమతి పత్రాలు, లైసెన్స్ రసీదులు ఏదీ కావాలన్న కాగితంపై రాసి ఇస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో వివిధ ఫైళ్ల నిర్వహణ, జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, పంచాయతీ ఆదాయం, ఆమోదించిన చెక్కులు, జీతాల రసీదులు ఇలాంటి పనులన్నీ మాన్యువల్‌గానే చేస్తున్నారు. ప్రతి నెల ఆదాయ వ్యయాలను ఆన్‌లైన్ ఆడిట్ చేయాల్సి ఉంటుంది. ఇలాంటి పనులన్నింటికి ఇంటర్‌నెట్ అవసరం ఉంటుంది.

టీ-ఫైబర్ ప్రారంభిస్తే అందుబాటులోకి ఎన్నో సేవలు

గ్రామీణప్రాంతాల్లో టీ-ఫైబర్ ఇంటర్‌నెట్ సదుపాయం కల్పిస్తే ఎన్నో సేవలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామాల్లో రేషన్ డీలర్లు, పోస్టల్ ఉద్యోగులు, ఉపాధి హామీ సిబ్బందికి ఆన్‌లైన్‌లో పలు విషయాలు అప్‌లోడ్ చేస్తుంటారు. టీ- ఫైబర్ పనిచేయడం ప్రారంభమైతే ఈ బ్యాంకింగ్, ఈ గవర్నెన్స్, సోషల్ వైఫై, టెలి మెడిసిన్ వీడియో కాన్ఫరెన్స్‌లు, ఈ క్లాస్ లాంటి సేవలు అందుబాటులోకి వస్తాయి.

పనులు వెంటనే పూర్తి చేయాలి: కడారి రతన్‌కుమార్, ఎలగందల్



ప్రస్తుత కాలంలో ప్రతి విషయం ఇంటర్‌నెట్‌తో ముడిపడి ఉన్నది. టీ-ఫైబర్‌తో ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వాలనే ప్రభుత్వ లక్ష్యం మంచిదే. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా కనెక్షన్లు ఇవ్వడం లేదు. ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇస్తే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గంభీరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో ఓఇంట్లో పేకాట ఆడుతున్న నలుగురు పేకాటరాయుళ్లను పట్టుకున్నట్టు ఎస్ఐ ప్రేమానందం తెలిపారు. ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్టు సమాచారం మేరకు అక్కడికి వెళ్లగా, స్వామి, అమీర్, శంకర్, రాజు పేకాట ఆడుతుండగా పట్టుబడ్డారని ఎస్ఐ ప్రేమానందం తెలిపారు. వారినుంచి రూ.8,200నగదు, మూడు సెల్‌ఫోన్లు, రెండుబైకులు, పేకాటముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నలుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రేమానందం తెలిపారు.

హత్యాయత్నం కేసులో తొమ్మిది మంది రిమాండ్

సిరిసిల్ల క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో భూ వివాదంలో కొలకాని పరుశరాములు, అతని కుటుంబ సభ్యులపై ఈ నెల 14న హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలో ప్రధాన నిందితుడైన కొలకాని శ్రీనివాస్‌తో సహా 9మందిని సోమవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్ల టౌన్ సిఐ కె. కృష్ణ వివరాల ప్రకారం.. పట్టణంలోని చంద్రంపేట గ్రామంలో కొలకాని అంజయ్య, అతని సోదరుడి కుమారులైన కొలకాని శ్రీనివాస్, నాగరాజుల మధ్య గత కొన్ని రోజుల నుంచి ఇంటి స్థలం వివాదం నెలకొంది. దీంతో నాగరాజు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు ఇంటి స్థలాన్ని జేసీబీతో చదును చేయడంతో ఇరుకుటుంబాల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవను మనసులో పెట్టుకున్న శ్రీనివాస్, నాగరాజులు మరికొంత మందితో కలిసి అంజయ్య కుటుంబాన్ని చంపితే భూమి తమ వాళ్లకే చెందుతుందని పథకం పన్నారు. ఈ పథకం ప్రకారం అంజయ్య కుటుంబ సభ్యులను శ్రీనివాస్, నాగరాజు, మంగ, మమత, ఎల్లవ్వలు కలిసి బూతు మాటలు తిడుతూ వేములవాడ అర్బన్ మండలంలోని మారుపాక గ్రామానికి చెందిన వేముల పెద్దభూమయ్య, అతని కుమారులు నాగరాజు, ప్రశాంత్‌లు కలిసి పర్శరాము లును దొరకబట్టడంతో వెంటనే అతనిపై శ్రీనివాస్ కత్తితో దాడిచేసి పొడిచాడు. పర్శరాములు తండ్రి అంజయ్య, తల్లి లచ్చవ్వను బండరాయితో దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటనపై బాధితులు ఫిర్యాదుచేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ప్రధాన నిందితుడైన శ్రీనివాస్ ఓ న్యాయవాది ద్వారా కోర్టులో సరెండర్ అయ్యాడు. సరెండర్ అయిన శ్రీనివాస్‌తో పాటు చంద్రంపేటకు చెందిన కొలకాని నాగరాజు, కొలకాని మంగవ్వ, కొలకాని మమత, కొలకాని ఎల్లవ్వ, వేములవాడ అర్బన్ మండలంలోని వేముల పెద్ద భూమయ్య, వేముల నాగరాజు, వేముల ప్రశాంత్, వేముల మల్లేశంలను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సీఎం తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై మహిళల ఆందోళన

ధర్మపురి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం పెద్దనక్కలపేట గ్రామపంచాయితీ ఎదుట సోమవారం పలువురు మహిళలు ఆందోళన చేశారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఇటీవల పంపిణీ చేసిన ఇళ్ల మంజూరు పత్రాల్లో పలువురు అర్హులకు చోటు దక్కలేదని వాపోయారు. అనర్హులకు ఇళ్లు కేటాయించి తమకు అన్యాయం చేశారని మహిళలు ఆరోపించారు. కిరాయి ఉంటున్న వారిని, వితంతువులకు, దారిద్ర్యరేఖకు దిగువఉన్న వారికి ముందుగా ఎంపిక చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. మొదటి లిస్ట్‌లో లబ్ధిదారులుగా తమ పేరు వచ్చిందని, దీంతో తాము పాత ఇళ్లను కూల్చి వేసుకున్నా మని పలువురు మహిళలు తెలిపారు.

కానీ ప్రస్తుతం లిస్ట్‌లో పేరు లేదని, ఉన్న ఇళ్లు పోగొట్టుకున్నామని ఆకుల అనిల్ అనే వ్యక్తి ఆవేదన చెందారు. ప్రభుత్వం తమకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని మహిళలు డిమాండ్ చేశారు.


గ్రామపంచాయతీ ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

మహిళపై దాడి

సుల్తానాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ గ్రామపంచాయతీ అనుబంధంగా ఉన్న కాశపల్లిలో సోమవారం ఓ మహిళపై దాడి జరిగింది. కాశపల్లిలో కొందరు గొడవ పడుతుండగా పాతిమా అనే మహిళ అడ్డుకోవడంతో అందులో ఒకరు ఆమెను కర్రతో తలపై కొట్టగా తీవ్రగాయమైంది. ప్రస్తుతం ఆమెపరిస్థితి విషమంగా ఉంది. సుల్తానాబాద్ ఆసుపత్రికి తీసుకురాగా వరంగల్ ఎంజీఎంకు తరలించాలని వైద్యులు సూచించారు. కుటుంబ సభ్యులు గాయపడ్డ మహిళను కరీంనగర్ తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

- 9మందికి జరిమానా

కోల్‌సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యంసేవించి వాహనాలు నడిపిన ఉప్పల నరేష్, ఆసంపల్లి నగేష్‌లకు మూడు రోజుల జైలు శిక్షను రెండవ అదనపు న్యాయమూర్తి వెంకటేష్ దుర్గ విధించినట్లు రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు తెలిపారు. 9మందికి రూ.14వేల జరిమానా విధించారని తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కారు, బైక్ ఢీ

ముత్తారం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మచ్చుపేట, బగుళ్ల పుణ్యస్నానానికి వెళ్లేదారిలో పోతారం చెందిన కట్ల పవన్ ద్విచక్రవాహనానికి కారు ఢీకొట్టడంతో పవన్‌కు తల, చాతిభాగంలో గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. పవన్‌ను చికిత్సనిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇంటి పై కప్పు తొలగించిన మనవడు

- పోలీసులను ఆశ్రయించిన వృద్ధ దంపతులు

శంకరపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామంలో ఇంటి పైకప్పును మనవడు తొలగించాడని వృద్ధజంట పోలీసులను ఆశ్రయించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల కొమురమ్మ-కనకయ్యలకు ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు గణేష్ చనిపోయాడు. మిగతా ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. కాగా కొమురమ్మ-కనకయ్య రాజాపూర్ గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్న కొమురమ్మ-కనకయ్యకు తోడుండాల్సిన మనవడు అదేం పట్టకుండా వీరిని ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ నెల 10న మనవడు ఉదయ్, పెద్దకోడలు లక్ష్మి కలిసి ఇంటిపై కప్పును తొలగించి, ఇంటి గోడను కూడా కూల్చివేసినట్లు తెలిపారు. దీంతో వారు కేశవపట్నం పోలీసులను ఆశ్రయించారు. వృద్ధదంపతులకు ఆసరాగా ఉండి చేరదీయాల్సిన పెద్దకోడలు, మనవడు ఉండేందుకు గూడు లేకుండా ఇంటి పైకప్పుతొలగించి గోడలు కూల్చి వేయడంతో గ్రామంలో చుట్టుపక్కల వారి ఇళ్లలో తలదాచుకునే పరిస్థితి ఏర్పడిందని గోడు వెళ్లబోసుకున్నారు. కాగాబ్లూకోర్టు పోలీసులు రాజాపూర్ గ్రామానికి చేరుకొని ఇంటిపైకప్పు తొలగించి గోడలు కూల్చివేసిన ఘటనపై వివరాలు సేకరించారు.

పురుగుల మందు డబ్బాలతో ప్రజావాణికి రైతులు

- చెరువు భూమిని కాపాడాలని డిమాండ్



జగిత్యాల కలెక్టరేట్‌కు పురుగుల మందు డబ్బాలతో వచ్చిన కొండాపూర్ గ్రామరైతులు

జగిత్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కొండాపూర్ గ్రామ శివారులోని బూరుగుకుంట చెరువును కబ్జా నుంచి కాపాడాలని, మరమ్మతు చేయించాలని రైతులు సోమవారం జగిత్యాల కలెక్టర్‌లో నిర్వహించిన ప్రజావాణికి క్రిమిసంహారక మందు డబ్బాలతో వచ్చి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు సంబంధిత రైతుల వద్ద నుంచి పురుగుల మందు డబ్బాలను లాక్కున్నారు. అనంతరం కలెక్టర్ సత్యప్రసాద్‌ను రైతులు కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. చెరువు ప్రాంతంలో ఇటీవల భూమికొనుగోలు చేసిన సబ్బనవేణి అంజయ్య అనే వ్యక్తి చెరువు మత్తడిని, చెరువు కట్టను ధ్వంసం చేశాడని రైతులు ఆరోపించారు. చెరువులో నీరు నిలవకుండా చేసి శిఖం భూమిని సాగు చేస్తున్నాడని, దీని వల్ల చెరువు కింద ఉన్న తమ భూముల గుండా నీరు ప్రవహించి తమ పంట కొట్టుకు పోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. అనేకసార్లు తహసీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపించారు. ఎన్నో సంవత్సరాల నుంచి సాగు చేస్తున్న తమ భూమి పనికి రాకుండా చేస్తున్నాడని రేగుల దేవమ్మ అనే వృద్ధురాలు రోదించింది. తమ సమస్యకు పరిష్కారం లభించకుంటే పురుగులమందు తాగుతా మని రైతులు హెచ్చరించారు. దీంతో విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ సత్యప్రసాద్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించి వెనుదిరిగారు.

బస్సులు ఆపడం లేదని మహిళల ఆందోళన

కథలాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని తాండ్ర్యాల స్టేజీ వద్ద ఆర్టీసీబస్సులు ఆపడం లేదని మహిళలు సోమవారం ఆర్టీసీ బస్సును నిలిపివేసి ఆందోళన చేశారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ తాండ్ర్యాల స్టేజి వద్ద ఆర్టీసీబస్సులు ఆపకపోవడంతో కోరుట్ల, కథలాపూర్ ప్రాంతాలకు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవిషయమై గతంలో కోరుట్ల డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించినా కనీస స్పందన లేదనివారు విమర్శించారు. మహిళలు అరగంటసేపు బస్సులను నిలిపివేయడంతో డిపోమేనేజర్ మహిళలతో ఫోన్‌లో మాట్లాడి బస్సులు తాండ్ర్యాలస్టేజీ నిలిపేలా డ్రైవర్లకు ఆదేశాలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విమరించారు.


తాండ్ర్యాలలో ఆర్టీసీ బస్సు ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

చోరీ కేసులో మరో నిందితుడి అరెస్టు

- మూడు తులాల బంగారం రికవరీ


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ ప్రదీప్‌కుమార్

గంగాధర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం వెంకటయ్యపల్లి చోరీకేసులో మరో నిందితుడిని పట్టుకుని, మూడు తులాల బంగారం రికవరీచేసినట్లు చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్ వెల్లడించారు. సోమవారం గంగాధర పోలీస్‌స్టేషన్‌లో చోరీలో మూడవ నిందితుడు చందుర్తి మండలంకు చెందిన పిట్టల అరవింద్‌ను అరెస్టు చేసి విలేకరులతో మాట్లాడారు. ఆయన వివరాల ప్రకారం ఈనెల 8న మండలంలోని వెంకటయ్యపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి 33 తులాల బంగారం నగదు, వెండి ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ చోరీ కేసులో ఈనెల 13న ఇద్దరు నిందితులను పట్టుకుని 20తులాల బంగారం రికవరీ చేయగా సోమవారం మూడో నిందితుడిని పట్టుకుని మరో మూడు తులాల బంగారం రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుడిపై గతంలో పలు కేసులున్నాయని తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన మరో నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్సై వంశీక్రిష్ణ, గంగాధర పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

జమ్మికుంట రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ముప్పిడితోట గ్రామానికిచెందిన యువతి చెవుల సౌమ్య(25) జమ్మికుంటలోని తమ సమీప బంధువుల ఇంట్లో మూడు నెలలుగా ఉంటోంది. ఈనెల 14న మధ్యాహ్నం 3గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి ఆమె కనిపించడం లేదు. ఈమేరకు ఆమె సోదరుడు సాయిచరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 10 మందికి స్వల్ప గాయాలు

కోరుట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బస్సు లారీని ఢీకొనడంతో సోమవారం 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిజామాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ముందుగా వెళ్తున్న లారీనీ ఢీకొట్టింది. దీంతో బస్సులో ప్రయాణం చేస్తున్న శివకుమార్, సుజాత, గంగనర్సు, పద్మ, వనిత, లక్ష్మి, కల్పన, ఉష్మా, మంజుల అనే ప్రయాణికులతోపాటు బస్సు డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. హుటాహుటిన ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులను స్థానికప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. సంఘటనా స్థలాన్ని కోరుట్ల ఎస్ఐ శ్రీకాంత్ పరిశీలించారు.

యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు

- ఇద్దరు నిందితుల అరెస్ట్

గంభీరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామ సమీపాన మానేరు కెనాల్ వద్ద జరిగిన మెండే సతీష్ హత్యకేసును పోలీస్‌లు ఎట్టకేలకు ఛేదించారు. ఈనెల13న లింగన్నపేటకు చెందిన మెండే సతీష్‌ను బీరు సీసాలతో దాడిచేసి దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. నిందితుల కోసం మూడు రోజులుగా పోలీస్‌లు తీవ్రంగా గాలించారు. ఎట్టకేలకు నిందితులను పోలీస్‌లు పట్టుకుని సోమవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరళించారు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, స్థానికఎస్ఐ ప్రేమానందం తెలిపినవివరాల ప్రకారం.. మృతుడు మెండే సతీష్, అదే గ్రామానికి చెందిన నిందితులైన నర్మాల పవన్ కుమార్, భీమయ్యగారి రాజశేఖర్‌లు సుతారి పనికి వెళ్లేవారు. ఈ క్రమంలో మృతుడు సతీష్ తన అవసరాలకు భీమయ్యగారి రాజశేఖర్ వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. అప్పు డబ్బుల కోసం ముగ్గురి మధ్య గొడవలు జరిగేవి. ఈనెల13న మానేరుకెనాల్ వద్ద నిందితుడైన పవన్ కుమార్, మృతుడు సతీష్ దావత్ చేసుకున్నారు. ఇదే క్రమంలో పవన్ కుమార్‌ను వారి సమీప బంధువులను సతీష్ అసభ్యకరంగా దూషించాడు. ఇదే విషయాన్ని రాజశేఖర్‌కు ఫోన్‌లో పవన్ చెప్పాడు. సతీష్‌ను చంపేద్దామని మనం అనుకున్నాం కదా.. ఇదే మంచి సమయం చంపేయంటూ ఫోన్‌లో రాజశేఖర్ పవన్‌కు చెప్పడంతో బీరు సీసాలతో తలపై, మెడపై సతీష్‌ను పవన్ కొట్టిచంపేశాడు. సతీష్‌ను హత్య చేసిన పవన్‌ను, హత్యకు ప్రోత్సహించిన రాజశేఖర్‌ను పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరళించినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. హత్యకు సంబంధించిన నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన స్థానిక ఎస్ఐ ప్రేమా నందం, ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రమాకాంత్, పోలీస్ సిబ్బందిని సీఐ శ్రీనివాస్ ఈ సందర్భంగా అభినందించారు.







మైమరపించే ప్రకృతి అందాలు

షూటింగ్, పిక్నిక్ స్పాట్‌గా బతుకమ్మ కుంట ప్రాంతం

ఇటీవల కురిసిన వర్షాలతో ప్రకృతి కొత్త అందాలను సంతరించుకుంది.. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రం సమీపంలోని బతుకమ్మ కుంట పరిసర ప్రాంతాలు ఎటు చూసినా పచ్చదనంతో మైమరపింపజేస్తున్నాయి. జగిత్యాల-కమ్మునూరు రోడ్డుకు రెండు వైపులా పచ్చని టేకు చెట్లతో వాహనదారులకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. బతుకమ్మ కుంట పరిసర ప్రాంతాలు షూటింగ్‌లకు అనుకూలంగా ఉంది. ఈ ప్రాంతంలో ఫోక్ సాంగ్స్, షార్ట్‌ఫిలింల చిత్రీకరణ జరుగుతుంటుంది. ప్రీ వెడ్డింగ్ షూట్స్ ఈ ప్రాంతంలో జరుపుతుంటారు. వారాంతాలు, సెలవు రోజుల్లో పలువురు పర్యాటకులు ఇక్కడికి పిక్నిక్‌కు వస్తుంటారు. మధ్యలో కుంట, చుట్టు పచ్చని చెట్లు, ఎత్తైన కొండలు పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. - సారంగాపూర్, ఆంధ్రజ్యోతి

పోలీసు ఉద్యోగం..

సమాజ సేవకు లభించిన అవకాశం

కరీంనగర్ సీపీ గౌస్ ఆలం



పీటీసీలో మొక్కనాటుతున్న సీపీ

కరీంనగర్ క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ఉద్యోగానికి ఎంపికవడం సమాజానికి సేవ చేసేందుకు లభించిన మంచి అవకాశమని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. గతంలో వెలువడిన పోలీసు కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో ఎంపికై వివిధ కారణాలతో హాజరుకాని 91 మందికి కరీంనగర్ పీటీసీలో సోమవారం శిక్షణ ప్రారంభించి మాట్లాడారు. దేశంలోనే తెలంగాణ పోలీసుశాఖ మొదటి స్థానంలో నిలిచిందని, తొమ్మిది నెలల పాటు అందించే శిక్షణను క్రమశిక్షణతో నేర్చుకోవాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు విధి నిర్వహణలో ఉపయోగపడతాయన్నారు. అంతకుముందు గౌరవ వందనం స్వీకరించిన సీపీ పీటీసీ ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో పోలీస్ ట్రైనింగ్ కాలేజ్(పీటీసీ) ప్రిన్సిపాల్, అడిషనల్ ఎస్పీ పిచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ మోహన్(డీఎస్పీ), డీఎస్పీలు మల్లికార్జున్, మహేష్‌బాబు, శ్రీనివాస్, విజయపాల్‌రెడ్డి, గంగాధర్, శివరామయ్య పాల్గొన్నారు.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా

అభివృద్ధి పనులు

- వేములవాడలో రోడ్ల విస్తరణతో సుదీర్ఘ నిరీక్షణకు తెర
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నానాటికీ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తగిన అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇందులో భాగంగానే ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రోడ్ల వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టామని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో ప్రధాన రోడ్డు వెడల్పులో భాగంగా ఇరువైపులా ఇళ్లను కూల్చివేసే కార్యక్రమం ప్రారంభమైన సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

వేములవాడ రాజన్న సన్నిధిలో అభివృద్ధికి శ్రీకారం చుట్టే క్రమంలో రోడ్ల వెడల్పు పనులు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయని, ప్రస్తుతం ఉన్న రోడ్డును 80 అడుగుల మేరకు విస్తరించేందుకు అవసరమైన పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. గత నవంబరు 20న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 8 మంది మంత్రుల సమక్షంలో 76 కోట్లతో ఆలయ విస్తరణ, 47 కోట్లతో రోడ్డు వెడల్పు కోసం, 35 కోట్లతో అన్నదాన సత్ర నిర్మాణం కోసం శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధితో పాటు, వేములవాడ పట్టణ అభివృద్ధి కోసం 2024-25 ఆర్థిక సంవత్సరంలో 50 కోట్లు, 25-26 బడ్జెట్లో 100 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. వేములవాడ పట్టణంతో పాటు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధి పనులను సమాంతరంగా చేపడుతున్నట్లు తెలిపారు. వేములవాడ పట్టణంలో రోడ్డు వెడల్పు చేయాలని గత 30 ఏళ్లుగా స్థానికులు కోరుకుంటున్నారని, గత ప్రభుత్వంలోగా కేవలం మాటలకు శంకుస్థాపనలకు పరిమితం



మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కాకుండా అభివృద్ధిని ఆచరణలో చూపిస్తూ రోడ్ల వెడల్పు పనులు ప్రారంభించామని అన్నారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవాలయాన్ని నాలుగు ఎకరాలలో విస్తరించేందుకు ఇప్పటి వరకు నాలుగు సార్లు శృంగేరి పీఠాధిపతి వద్దకు వెళ్లి వారి సలహాలు సూచనలు స్వీకరించి, వాటి ప్రకారం ముందుకు సాగుతున్నామని తెలిపారు. తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే రాజన్న భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామని, శ్రీ స్వామివారి శీఘ్రదర్శనం కలిగేలా ఏర్పాటు చేస్తామని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజన్న ఆలయం మెట్లమీద ఇచ్చిన హామీని తప్పాడని, తన పెళ్లి ఇక్కడే అయ్యిందని ప్రజలను మభ్యపెట్టి తక్షణమే 100 కోట్ల రూపాయలు విడుదల చేస్తానని మోసం చేశారని గుర్తు చేశారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు రాజన్న ఆలయం ఎలా ఉందో ఇప్పటి వరకు అలాగే ఉందని, రంగురంగుల బ్రోచర్లలో మాత్రమే అభివృద్ధిని చూపించారని ఒక్క ఇటుక కూడా పేర్చలేదని అన్నారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు అమలవుతున్నాయన్నారు. రోడ్డు వెడల్పులో భూములు కోల్పోతున్న వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించామని, అయినప్పటికీ రోడ్ల వెడల్పు కోసం భూ నిర్వాసితుల త్యాగాన్ని ఎట్టి పరిస్థితుల్లో మరువబోమన్నారు. మెయిన్ రోడ్‌లో ఎన్నో ఏళ్లుగా వ్యాపారాలు నిర్వహించుకుంటున్న దుకాణదారులకు ప్రభుత్వం చేదోడువాదోడుగా ఉంటుందని, పట్టణ ప్రజలకు, యాత్రికులకు ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తామని అన్నారు. రానున్న రోజుల్లో వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే విధంగా కృషి చేస్తానని ఆది శ్రీనివాస్ అన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు

మంత్రి పదవులు

- సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మంత్రి అడ్లూరికి రాజన్న చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో రాధాబాయి

వేములవాడ కల్చరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు చెందిన తనకు గడ్డం వివేక్‌కు, వాకిటి శ్రీహరిలకు ఒకే రోజు మంత్రి పదవులు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సోమవారం వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చిన ఆయన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆలయ గెస్ట్‌హౌస్‌లో విలేకర్లతో మాట్లాడారు. మా ఇంటి ఇలవేల్పు, కుల దైవం వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారన్నారు. అమ్మవారి దర్శనం అనంతరమే ఏ కార్యక్రమైనా మొదలు పెడుతామని చెప్పారు. 1984 నుంచి ఎన్ఎస్‌యూఐ నుంచి మొదలుకొని నేటి వరకు కాంగ్రెస్‌లో తన ప్రయాణం కొనసాగుతుందని అన్నారు.

అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జూడోయాత్ర దేశ రాజకీయాలన మార్చిందని అన్నారు. ఈ యాత్ర సామాజిక న్యాయానికి పునాది వేసిందని అన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా, ప్రమాదం ఉందని తెలిసినా రాహుల్‌గాంధీ యాత్రను కొనసాగించడం చరిత్రాత్మకమని కొనియాడారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని, అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రైతులకు రుణమాఫీ, సన్న బియ్యం, రికార్డ్ స్థాయిలో రేషన్ కార్డుల పంపిణీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 59వేల ఉద్యోగాలను ఇచ్చినట్లు వివరించారు. గత ప్రభుత్వం మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇలాంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే సోషల్ జస్టిస్‌కు కేరాఫ్ అని తెలిపారు. ధర్మపురి ప్రజల దీవెనలతో, కాంగ్రెస్‌పార్టీ అగ్రనేతల ఆశీస్సులతో, సీఎం రేంత్‌రెడ్డి కృషితో నాకు అప్పగించిన మంత్రి పదవిని సమర్థవంతంగా నిర్వ హించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

రాజన్నను దర్శించుకున్న మంత్రి అడ్లూరి

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి ఆలయానికి చేరుకున్న మంత్రి సోమవారం ఉదయం శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభతో ఘన స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం శ్రీస్వామి వారి మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఆలయ ఈవో రాధాబాయి శ్రీస్వామి వారి శేషవస్త్రం, రాజన్న చిత్రపటాన్ని అందజేశారు.

ప్రధాన సమస్యలపై దృష్టి మరల్చేందుకే

ఏసీబీ విచారణ పేరుతో హడావుడి

- బీఆర్ఎస్ లోపాలు అంతర్గతంగా సవరించుకుంటాం
- నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



జగిత్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమ స్యలపై దృష్టి మరల్చేందుకే ఏసీబీ విచారణ పేరుతో ప్రభుత్వం హడావుడి చేస్తోందని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. కేటీఆర్ విచారణ సందర్భంగా తెలంగాణ భవన్‌కు తాళం వేయడం దుర్మార్గమని, బీఆర్ఎస్ లోపాలు అంతర్గతంగా సవరించుకుంటామని, మాపై బయటి వారు ఎవరైనా దాడి చేస్తే కలిసికట్టుగా ఎదుర్కొంటామని ఆమె పేర్కొన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం నవదుర్గ ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుం దన్నందుకే నోటీసులు, విచారణల పేరుతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆమె విమర్శించారు. ఏ పార్టీలోనైనా లోపాలు ఉన్నప్పుడు అధినేతకు చెప్పుకోవడం సహజంగా జరుగుతుందన్నారు. చెప్పుకున్నంత మాత్రాన దాన్నేదో భూతద్దంలో చూపించాల్సిన అవసరం లేదన్నారు.

వానాకాలం పంట సీజన్ మొదలైనప్పటికీ రైతులు రైతు భరోసా సాయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. హామీల అమలుపై, సర్కారు చేస్తోన్న అక్రమాలపై ప్రశ్నిస్తున్నామనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మొన్ననే కాళేశ్వరం కమిషన్ పేరుతో కేసీఆర్‌ను విచారణ చేసిందని, తాజాగా కేటీఆర్‌ను ఏసీబీ విచారి స్తోందన్నారు. బీఆర్ఎస్ నేతలు వేధింపులకు భయపడే వాళ్లు కాదని.. కేటీఆర్ విచారణకు హాజరయ్యారని వివరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను బయటికి రానివ్వకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. జగిత్యాల నవదుర్గ ఆలయ అభివృద్ధికి ఎంపీ దామోదర్ రావు ఎంపీ లాడ్స్ నుంచి రూ.90 లక్షలు కేటాయించారని, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ మరో రూ.10 లక్షలు కేటాయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, జగిత్యాల, రాయికల్ మాజీ ఏఎంసీ చైర్మన్లు శీలం ప్రియాంక, ఉదయశ్రీ, నాయకులు మారంపల్లి రాణి, మహేశ్, సంధ్యారాణి, శారద, తుమ్మ గంగాధర్, బర్కము మల్లేశం, అనిల్, తేలు రాజు, గంగారెడ్డి, అనుధార, తిరుపతి, ప్రణయ్ పాల్గొన్నారు.

ఎల్ఎల్ఎం సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూన్, 16(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో 2025 ఏప్రిల్‌లో నిర్వహించిన ఎల్ఎల్ఎం ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం నరమేధాన్ని

విరమించుకోవాలి

- మావోయిస్టుల పేరుతో ఆదివాసులను అంతం చేయడం సరికాదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



సిరిసిల్లలో సీపీఐ మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే సాంబశివరావు

సిరిసిల్ల రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్రం ప్రభుత్వం చేపట్టిన నరమేధం విరమించుకోవాలని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనవేని సాంబశివరావు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా నాలుగవ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి లహరి ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ తీశారు. లహరి ఫంక్షన్‌హాల్‌లో మహాసభల సందర్భంగా సీపీఐ జెండాను ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం సీపీఐ నాయ కురాలు అనసూర్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేతలో భాగంగా దండకారుణ్యంలో ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వంతో కలిసి నరమేధాన్ని సృష్టిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయించుకునేందుకు పోరాటాలు చేయాలన్నారు. బీజేపీ మతవాద పార్టీకి వ్యతిరేకంగా తెలంగాణ గడ్డమీద కరుడుగట్టిన ఆ పార్టీని అడుగు పెట్టనీయ కుండా ప్రజలందరం ఐక్యం కావాలన్నారు. గత పాలకులు అనేక భూఆక్రమణలకు పాల్పడి నిరుపేద భూములను తీసుకున్నారన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో వీలైన మేరకు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేయాలన్నారు. దీనికి కోసం ఇప్పటినుంచే బలంగా ఉన్న ప్రాంతాలల్లో ప్రచారం చేపట్టాలన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా మంద సుదర్శన్ నియమాకం

రాజన్న సిరిసిల్ల జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఇల్లంతకుంట మండలం వెంట్రావుపల్లె గ్రామానికి చెందిన మంద సుదర్శన్‌తో పాటు 9మంది సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం మహాసభలో పలు తీర్మాణాలను ఆమోదించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లి వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి గుంటి వేణు, కడారి రాములు, మీసం లక్ష్మన్, పంతం రవి, ఎలిగేటి రాజశేఖర్, భూంపెల్లి భూమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గోదావరిఖనిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న విమలక్క

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

గోదావరిఖని: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని అరుణోదయ కళా సంఘం గౌరవ అధ్యక్షురాలు విమలక్క డిమాండ్‌చేశారు. సోమవారం భాస్కర్‌రావు భవన్‌లో ఏర్పాటు చేసిన నిరసన సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను, మావోయిస్టులను హత్య చేస్తుందని, కేంద్ర బలగాలతో అడవులను జల్లెడ పడుతూ ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టి ఖనిజ సంపదను అదాని, అంబానీలకు దోచి పెట్టడానికి కుట్ర చేస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షాలు 2026వరకు మావోయిస్టు పార్టీని అంతం చేయడానికి కంకణం కట్టుకున్నారని, దీనిని ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని, ఎన్‌కౌంటర్ల పేరుతో 570మందిని హత్య చేశారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరుపాలని డిమాండ్ చేశారు. గోదావరిఖని చౌరస్తా నుంచి నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. విశ్వనాథ్, రత్న కుమార్, విజయ్‌కుమార్, ఆరెల్లి కృష్ణ, మాదన కుమారస్వామి, మాదాసు రామమూర్తి, ముడిమడుగుల మల్లన్న, తాండ్ర సదానందం, రాజన్న పాల్గొన్నారు.

ఎస్సారార్ కళాశాలలో కొత్త కోర్సు

గణేశ్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి బీకాం(రిటైల్ ఆపరేషన్స్) అనే కొత్త డిగ్రీ కోర్సును ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, సురేందర్‌రెడ్డి, వాణిజ్య విభాగ అధ్యక్షుడు టి.రాజయ్య, దోస్త్ కోఆర్డినేటర్ రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రిటైల్ రంగం ప్రాధాన్యం దృష్ట్యా ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రాయోగిక పరిజ్ఞానం, నైపుణ్యాలను అందించేందుకు రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థులు దోస్త్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కండక్టర్ లేకుండానే బస్సు తీసుకువెళ్లిన డ్రైవర్

కళ్యాణ్ నగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కండక్టర్ లేకుండానే డ్రైవర్ బస్సును తీసుకువెళ్లిన ఘటన సోమవారం గోదావరిఖని బస్టాండ్‌లో చోటుచేసుకుంది. గోదావరిఖని డిపోకు చెందిన టీఎస్02 జెడ్-0286 బస్టాండ్‌లో కరీంనగర్‌కు ప్రయాణికులను ఎక్కించుకున్నారు. కండక్టర్ లేకుండానే బస్సును డ్రైవర్ మున్సిపల్ కార్పొరేషన్ టీ జంక్షన్ వరకు తీసుకు వెళ్లారు. కండక్టర్ లేడని ప్రయాణికులు చెప్పినప్పటికి వినకుండా బస్సును తీసుకు వెళ్లాడు. బస్సులో ప్రయాణికుడు ప్రవీణ్ డిపోమేనేజర్ నాగభూషణానికి ఫిర్యాదు చేశాడు. దీంతో డ్రైవర్ బస్సును తిరిగి బస్టాండ్‌కు తీసుకు వచ్చారు. అందులో ఉన్న ప్రయాణికులు దిగి మరో బస్సులో వెళ్లిపోయారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా కండక్టర్ లేకుండా బస్సును తీసుకు వెళ్లాడని, తాము చెప్పిన వినలేదని, అత్యవసర పరిస్థితుల్లో వెళ్లే వారి పరిస్థితి ఏమిటని ప్రయాణికులు ప్రశ్నించారు.

గుట్టల మట్టి మాయం..

- వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లతో అక్రమంగా తరలింపు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు
- రెచ్చిపోతున్న అక్రమార్కులు



హుజూరాబాద్ మండలం రంగాపూర్‌లో గుట్ట వద్ద తవ్విన మట్టి

హుజూరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లోని గుట్టల్లోని మట్టిని అక్రమార్కులు మాయం చేస్తున్నారు. పచ్చదనంతో కనబడే గుట్టలు నేడు బొందల గడ్డలుగా మారాయి. గుట్టలు ఉంటే చాలు టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. హుజూరాబాద్ పట్టణ శివారులోని రంగాపూర్, సిర్సపల్లి, కొత్తపల్లి, గణేష్‌నగర్, బోర్నపల్లి, ఎలబోతారం గ్రామాల్లో ప్రభుత్వ గుట్టలు మట్టితో నిండి ఉన్నాయి. వీటిపై కొంత మంది అక్రమార్కులు కన్ను పడింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా మట్టిని రవాణా చేస్తున్నా సంబంధిత రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వ గుట్టల నుంచి బహిరంగంగా ఎక్స్‌కవేటర్ల సహాయంతో మట్టిని తవ్వుతున్నారు. హుజూరాబాద్‌లో ఇటీవల ఇళ్ల నిర్మాణం బాగా పెరిగింది. దీనికి మట్టి అవసరం ఉండగా, పరిసరా ప్రాంతాల్లో దొరకడం లేదు. ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు మట్టిని వ్యాపారం చేస్తున్నారు.



టిప్పర్ మట్టికి రూ. రెండు వేలు

హుజూరాబాద్‌లో టిప్పర్‌కు 1700 నుంచి రెండు వేల రూపాయల వరకు తీసుకుని మట్టిని తరలిస్తున్నారు. గతంలో పచ్చదనంతో కళకళలాడిన గుట్టలు ఇప్పుడు భారీ గుంతలుగా మారాయి. మట్టిని తరలిస్తున్నవారు పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు మామూళ్లు ముట్టజెబుతున్నామని బహిరంగంగా చెబుతున్నారు. గుట్టల నుంచి మట్టిని తరలిస్తుండడంతో వన్యప్రాణులు గ్రామాల్లోకి తరలి వస్తున్నాయి. గుట్టల నుంచి తీసుకొచ్చిన మట్టిని కొత్తపల్లి, గణేష్‌నగర్, రంగాపూర్ గ్రామాల శివారుల్లో డంప్ చేస్తు న్నారు. అక్కడి నుంచి అవసరమున్న వారికి సరఫరా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ దందాపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బొందలగడ్డగా మారిన గుట్టలు



రాజేందర్, గ్రామస్థుడు, రంగాపూర్

ఒకప్పుడు పచ్చదనంతో ఉండే గుట్టలు నేడు బొందలగడ్డగా మారాయి. గుట్టల్లో నుంచి మట్టిని అక్రమంగా తోడేస్తున్నారు. నిత్యం వేలాది ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలి.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

ధర్మపురి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తుమ్మెనాల ప్రభుత్వ పాఠశాల, ఉన్నత పాఠశాల, కమలాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ ఏకరూప దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య పాల్గొన్నారు. తుమ్మెనాల పాఠశాలలో చదివిన 2013-14 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాల మధ్యాహ్న భోజనం కిచెన్ షెడ్ మరమ్మత్తుల కోసం రూ.14300 అందించారు.

'ఉపాధిహామీ'ని సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకాన్ని అర్హత గల ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎల్లాపూర్‌లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులలో భాగంగా కోళ్లఫారం నిర్మాణానికి గాను సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి ముగ్గు పోసి నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, టెక్నికల్ అసిస్టెంట్ రాజేశం, కార్యదర్శి శ్రీనివాస్, క్షేత్ర సహాయకులు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నోట్ బుక్కులు అందజేత

కొడిమ్యాల, జూన్16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిర్మాలాపూర్, తిప్పయ్య పల్లి, నమిళికొండ, చెప్యాల, పూడూర్, నల్లగొండ పాఠశాలలో సోమవారం కొండగట్టు గిరి ప్రదక్షిణ వ్యవస్థాపకుడు చిలుకూరి బాలాజీ శివాలయం ప్రధాన అర్చకుడు సురేష్ ఆత్మారాం ఆధ్వర్యంలో ఇటీవల పంపిన కొండగట్టు గిరి ప్రదక్షిణ నోట్ బుక్కులను విద్యార్థులకు ఉపాధ్యాయులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోత్స్న దేవి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మల్యాల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేసే దివ్యాంగుల ఉపకరణలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకో వాలని ఎంపీడీవో స్వాతి తెలిపారు. వివిధ రకాల ఉపకరణలకు ఈ నెల 18లోపు మీ సేవా కేంద్రాలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

మల్యాల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలపల్లెకు చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు ఎనుగందుల సుమన్ గత కొంత కాలం అనారోగ్యంతో మృతి చెందగా మృతుడి కుటుంబసభ్యులను సోమవారం ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు.

జగిత్యాలకు వెలుతూ మార్గమధ్య లోని మల్యాల క్రాస్ రోడ్డు వద్ద ఆగారు. ఈ సందర్భంగా అక్కడ ఆగిన కవిత కార్యకర్త భార్యను పరామర్శించి ఆదుకుంటామని అన్నారు. బీఆర్ఎస్ నాయకుడు ఎం.డీ.రియాజ్ తదితరులు ఉన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు ప్రజావాణిలో పరిష్కారం అవుతా యనే ఆశతో ప్రజలు వస్తారన్నారు. ప్రజావాణి సమస్యల పరిష్కారంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాల యంలో నిర్వహించిన ప్రజావాణిలో 59 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

డబ్బులు ఇస్తలేరు
-గొల్ల మల్లయ్య దంపతులు, చందోళి

మాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. నా పెద్ద కొడుకు కొమురయ్య ఎకరం భూమిలో పంట చేసుకుం టాడు. సంవత్సరానికి 30 వేలు ఇస్తాడు. నాకు ఆపరేషన్ అయింది. కన్ను ఆపరేషన్‌కు డబ్బులు ఖర్చు అయ్యాయి. డబ్బులు ఇవ్వమంటే ఇవ్వడం లేదు. పొలం అమ్ముకుందామంటే అమ్మనివ్వడం లేదు.

చెరువును ఆక్రమిస్తున్నారు
-గంగాపుత్రులు, మల్యాల

మాది మల్యాల మండల కేంద్రం. మా గ్రామంలో 3 వందల మంది గంగపుత్రులు ఉంటారు. మేమందరం చేపలు పట్టుకుని జీవిస్తున్నాము. చెరువును కొందరు ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తున్నారు. చెరువులో నిర్మించిన అక్రమ నిర్మాణాలతో పాటు వాటి వెనుక వేసిన రోడ్డును తొలగించాలి.

నా ఇంటి స్థలం ఆక్రమించుకున్నారు
-సుదవేణి బాలరాజు రాయికల్



నేను 2011లో డిస్మెటల్ ఇల్లు కొనుగోలు చేశాను. అప్పటి నుంచి ఆ ఇల్లు నా స్వాధీ నంలో ఉన్నది. చుట్టు ఫిన్సింగ్ చేశాను. హద్దురాళ్ళు కూడా ఏర్పాటు చేశా. రాయికల్ గ్రామానికి చెందిన ఆర్మూర్ భాగ్య నాగమణి శివ కుమార్, తదిత రులు నా భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డర్‌ను కూడా వారు ఖాతరు చేయడం లేదు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సోమవారం ప్రకటించిన ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో మాస్ట్రో జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచి నట్లు కళాశాల కరస్పాండెంట్ ఆకుల రాజేష్ తెలిపారు. ఎంపీసీ విభాగంలో సుంకరి శృతి 470 మార్కులకు 468, బైపీసీలో సంజన 440 మార్కులకు 438 మార్కులు, సీఈసీ విభాగంలో ఎంబేరి జాగృతి 500 మార్కులకు గాను 495 మార్కులు సాధించినట్లు రాజేష్ తెలిపారు.

●పీఆర్‌బీఎం విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్ తెలిపారు. బైపీసీ విభాగంలో భువనేశ్వరి, జోయి 440 మార్కులకు గాను 437 మార్కులు, సీఈసీ విభాగంలో అక్షయ 500 మార్కులకు గాను 490 మార్కులు, విక్రాంత్ రెడ్డి 500 మార్కులకు గాను 486 మార్కులు, ఎంపీసీ విభాగంలో ముజమిత్ 470 మార్కులకు గాను 462 మార్కులు సాధించినట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు.

●మల్లాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 88 శాతం ఫలితాలు సాధించినట్లు సోమవారం ప్రిన్సిపాల్ బండి నారాయణ తెలిపారు. కళాశాలలోని మొదటి సంవత్సరంలోని 90 మందికి 79, రెండవ సంవత్సరంలో 64 మందికి 57 ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే భూ భారతి


నంచర్లలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

పెగడపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రైతుల మేలు కోసమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూభారతి పథకాన్ని అమలులోకి తెచ్చినట్లు పెగడపల్లి మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని నంచర్ల, పెగడపల్లి గ్రామాలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సోమ వారం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమాలలో తహసీల్దార్ రవీందర్, నాయబ్ తహసీల్దార్ లాస్యశ్రీ గిర్దావర్‌లు శ్రీనివాస్, జమున, ఆంజనేయులు పాల్గొన్నారు.

●కొడిమ్యాల: మండలంలోని పూడూర్ గ్రామంలో సోమవారం భూ భారతి గ్రామ సభను రెవెన్యూ అధికారులు నిర్వహించారు. గ్రామ సభలో ప్రజల నుండి 117దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఎం. కిరణ్‌కుమార్ తెలిపారు.

●రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో సోమవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ పద్మయ్య ప్రజల నుంచి 452 దరఖాస్తులను తీసుకున్నారు. వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అన్ని గ్రామాలకంటే ఎక్కువగా ఈ గ్రామంలో దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్లు, రెవెన్యూ సిబ్బంది, మహిళా సిబ్బంది, గ్రామ నాయకులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య'

మల్యాల, జూన్ 16(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులు ఉన్నారని దాంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల అభ్యాసన సామర్థ్యా లను అందించే అవకాశం ఉందని జిల్లా సెక్టోరియల్ అధికారి రాజేశ్, మండల విద్యాధికారి జయసింహరావు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని తక్కళ్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

గ్రామస్థులందరూ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, శివకుమార్, గంగాధర్‌చారి, చైర్‌పర్సన్ స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు రజిత, మమత పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్, జూన్, 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకానలు లబ్ధిదారులు సద్విని యోగం చేసుకోవాలని మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మల్లాపూర్, నడికుడా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంకు భూమి పూజ కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ నల్ల రాజన్నతో కలిసి చేశారు. .

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ

మెట్‌పల్లి రూరల్, జూన్, 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపేట గ్రామంలోని ఎస్‌వీఎస్ గార్డెన్‌లో పలు గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన లబ్ధిదారులకు సోమవారం కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, పాల్గొన్నారు.

భూమి పూజ

గొల్లపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గొల్లపెల్లి మండలం రాఘవపేట గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇండ్లకు ప్రజా ప్రతినిధులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఊట్కూరి సురెందర్‌రెడ్డి, నాయకులు కొలకాని జలంధర్, కొలకాని అశోక్, చిట్యాల శ్రీకాంత్, బోయకోతు రాజేశం ఇండ్ల లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

గాయత్రిబ్యాంకు పాలకవర్గం ఎన్నిక

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని గాయత్రి అర్బన్ బ్యాంకు పాలకవర్గం ఎన్నిక సోమవారం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్యప్రసాద్, సహాయ ఎన్నికల అధికారి మనోజ్‌కుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర సహకార ఎన్నికల సంఘ ధృవీకరణ అనంతరం నూతన పాలక మండలి ఎన్నిక ఫలితాలు ఉంటాయని బ్యాంకు సీఈవో వనమాల శ్రీనివాస్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

(ఐదో పేజీ తరువాయి)

ఏర్పాటు చేసి, వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేస్తున్నారు. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా వ్యాధుల సమాచారాన్ని పంచుకుంటూ వెంటనే చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేశారు.

● హాస్టళ్లలో పరిశుభ్రత..

ప్రభుత్వ హాస్టళ్లలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు తనిఖీలు నిర్వహించి పరిశుభ్రతను నిర్ధారిస్తున్నాయి. వార్డెన్లు, వంట సిబ్బందిని అప్రమత్తం చేస్తూ తాగునీరు, వంట నీరు శుద్ధిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఓవర్ హెడ్ ట్యాంకుల శుభ్రత, పైప్‌లైన్ లీకేజీల నివారణ, బోర్‌వెల్ ప్లాట్‌పామ్‌ల వద్ద నీరు నిల్వ లేకుండా చూడ టం, దోమల వృద్ధిని అరికట్టేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు జిల్లా అధికార యంత్రాంగం సమగ్ర చర్యలు చేపడు తోంది. కలుషిత నీరు, దోమల నివారణ, పరిశుభ్రత, వైద్య శిబిరాలతో పాటు ర్యాపిడ్ రెస్పాన్స్ టీంల ఏర్పాటుతో వ్యాధులను అరికట్టేందుకు కృషి చేస్తోంది. ప్రజలు కూడా పరిశుభ్రత, సురక్షిత ఆహారంపై శ్రద్ధ వహిస్తే సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా నియంత్రించవచ్చని వైద్యులు ప్రచారం చేస్తున్నారు.

● జిల్లాలో ఇంటింటా జ్వర సర్వే..

గత నెల 29 నుంచి జూన్ 7వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది 2,60,891 ఇళ్లు పరిశీలించగా 2,556 ఇళ్లలో లార్వా పాజిటివ్ గుర్తించారు. జ్వరంతో బాధపడుతున్న వ్యక్తుల గుర్తింపు సంఖ్య 203 కాగా, డెంగ్యూ, మలేరియా పాజిటివ్ వచ్చిన వ్యక్తుల సంఖ్య 195గా అధికారుల సర్వేలో తేలింది. జిల్లా వ్యాప్తంగా జరిగిన సర్వేలో 25,737 పాత టైర్లను పరిశీలించగా 369 టైర్లలో లార్వా గుర్తించారు. 56,378 కూలర్లను పరిశీలించగా 266 కూలర్లలో లార్వా ఉండగా, 61,982 డ్రమ్ములు పరిశీలించగా 368 డ్రమ్ములలో లార్వా, 61,606 సిమెంట్ గాజులకు గాను 515 వాటిల్లో లార్వా ఉన్నట్లుగా గుర్తించారు. 51,582 కుండలు పరిశీలించగా 627 వాటిల్లో లార్వా, 3,19,810 ప్లాస్టిక్ కంటైనర్లు పరిశీలించగా 2,571ల్లో లార్వా ఉన్నట్లుగా గుర్తించారు. 2,571 నీటి గుంటలు పరిశీలించగా 107 గుంటల్లో లార్వా నిల్వలున్నట్లుగా పరిశీలనలో వెల్లడైంది. అన్ని కంటైనర్లు కలిపి 5,80,668 పరిశీలించగా 3,551 వాటిల్లో లార్వా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

అప్రమత్తంగా ఉన్నాం
-డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, జగిత్యాల



జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ ఆధ్వర్యంలో అప్రమత్తం చేశాం. జిల్లా టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేశారు. ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను జిల్లాతో పాటు, మండలాల వారీగా ఏర్పాటు చేసి, ఫోన్ నంబర్‌ను అందుబాటులో ఉంచాం. ఎక్కడ సీజనల్ వ్యాధులు వచ్చినా అప్రమత్తమై వ్యాధులు ప్రబల కుండా తగిన చర్యలు తీసుకుంటాం. అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో పరిశుభ్రతపై దృష్టి సారించాం. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం.

ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో సోమవారం తెలంగాణ జాగృతి నేత, ఎమ్మెల్సీ కవిత పర్యటించారు. జగిత్యాల పట్టణంతో పాటు రూరల్ మండలంలో పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. జగిత్యాలకు విచ్చేసిన కవితకు జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ఘన స్వాగతం పలికారు. ఆమె వెంట ఏఎంసీ మాజీ చైర్మెన్ శీలం ప్రియాంక ప్రవీణ్, హెచ్‌సీఏ మాజీ సభ్యులు దావ సురేష్, మాజీ కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి, పడిగెల గంగారెడ్డి, అనురాధ, కోటగిరి మోహన్‌లు ఉన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన చికిత్సను అందించాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతున్న వారికి మెరుగైన చికిత్సను అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరా బాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోరుట్ల పట్టణానికి చెందిన రాజేష్, సాయకృష్ణ, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంకు చెందిన రోహిత్, హన్మంత్, ఆకాష్‌లను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పరిశీలించారు. వారికి అందుతున్న చికిత్స వివరాలను ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో ఫోన్ ద్వారా మాట్లాడారు. సంఘటనలో గాయపడిని వారికి ప్రభుత్వం ఆదుకోవాలని, మృతిచెందిన వారికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు


పెగడపల్లిలో బీరప్ప బోనాలు

పెగడపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలో బీరప్ప ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12న ప్రారంభమైన బీరప్ప కమరాతి కళ్యాణ మహోత్సవాలలో భాగంగా సోమవారం యాదవ కులస్తులందరి ఇండ్ల నుంచి బోనాలతో డప్పు చప్పుల్ల మధ్యన కళాకారుల విన్యాసాలతో ర్యాలీగా బీరప్ప ఆలయానికి తరలి వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామమంతా పండుగ వాతావరణం సంతరించుకుంది.

మంత్రి హామీతో సమస్య పరిష్కారం

మల్లాపూర్, జూన్, 16 (ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్క హామీతో చెత్త సేకరణకు పంచాయతీ ట్రాక్టర్లు మళ్లీ రోడ్డు ఎక్కనున్నాయి. మండలంలోని గ్రామాల్లోని ట్రాక్టర్లను నిర్వహించలేమని ఎంపీవోకు తాళాలు ఇచ్చిన విషయం తెలిసిందే. సోమవారం సీతక్కను పంచాయతీ కార్యదర్శులు కలిసి సమస్యలు పరిష్కరిస్తానని ఇచ్చిన హామీతో మళ్లీ ట్రాక్టర్ల తాళాలను ఎంపీవో నుంచి తీసుకున్నారు. మంత్రి హామీతో ట్రాక్టర్ల తాళాలను స్వీకరించి గ్రామాల్లోని చెత్తను సేకరించడం జరుగుతుందని ప్రకటన ద్వారా తెలిపారు. దీంతో గ్రామాల్లో చెత్త సేకరణకు ట్రాక్టర్ల రోడ్డు ఎక్కనున్నాయి.

కలెక్టర్‌కు టీఎన్జీవోల శుభాకాంక్షలు

జగిత్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కలెక్టర్‌గా సంవత్సరం పూర్తయిన సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌కు జిల్లా టీఎన్జీవో కార్యవర్గం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు మిర్యాల నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాలలో ముందుకు తీసుకువెళ్లడానికి జిల్లా ఉద్యోగులందరు ఐక్యంగా కృషి చేస్తున్నారని అన్నారు. ఉద్యోగులందరి సహకారంతో సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు చేరవేసి జిల్లాకు మంచి పేరు తీసుకు వద్దామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిఎన్జీఓ నాయకులు సాహెద్ బాబు, రవీందర్, కిరణ్, ప్రమోద్, మధుకర్, నగేష్, అరుణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవిని ఇవ్వాలి'

కోరుట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవిని కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మున్నూరు కాపు సంఘ నాయకులు పట్టణంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీని నిర్వహించారు. పట్టణంలోని ఐబి రోడ్డులోని అంజనేయ స్వామి దేవాయలం నుండి ద్విచక్ర వాహన ర్యాలీని మున్నూర్ కాపు సంఘ జిల్లా అధ్యక్షుడు చదలు సత్యనారాయణ, కోరుట్ల మున్సిపల్ మాజీ చైర్మెన్ శీలం వేణుగోపాల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘ నాయకులు మాట్లాడారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మున్నూర్ కాపులకు అన్యాయం జరిగిందని, దానిని లోపం పూడ్చడానికి ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘ నాయకులు పాల్గొన్నారు.

రైతు నేస్తాన్ని సద్వినియోగం చేసుకోవాలి


రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆర్డీవో శ్రీనివాస్, రైతులు

మెట్‌పల్లి రూరల్, జూన్, 16 (ఆంధ్రజ్యోతి) : రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని చౌలమద్ది గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డితో కలిసి పాల్గొని వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నరేష్, ఆర్ఐ ఉమేష్, పంచాయతీ కార్యదర్శి రవి, కారోబార్ రాములు, రైతులు లింగారెడ్డి, రాజారెడ్డి, వెంకటేష్, రవి, రాజేందర్, గంగారాం, సాయన్న, నర్సారెడ్డి, రాములు, ఎల్ల, వనిత, రాజు, గంగు, లక్ష్మి, కవిత, నర్సు, రాజు, ఐకేపీ వవోలు ప్రవిత్రరాణి, హరిత, తదితరులు పాల్గొన్నారు.

●కోరుట్ల రూరల్: వానం కాలం రైతు భరోసా కార్యక్రమంలో భాగంగా రైతు వేదికలలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆన్‌లైన్ ద్వార ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ క్లస్టర్‌ల ఇంచార్జులు వీడియా కాన్ఫరెన్స్ ద్వార పంట సాగులపై ప్రదర్శనల ద్వార వివరించారు. వర్ష కాలం పండిచె పంటలపై విరిస్తూ రైతులకు చైతన్యవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కృపాకర్, ఎంపిడిఓ రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారి నాగమణిలు పాల్గొన్నారు.

●కొడిమ్యాల: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసందాన ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎంతో ముఖాముఖిలో రైతులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 1031 రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం నిర్వహించగా మండలంలోని తిర్మాలాపూర్, కొడిమ్యాల, పూడూర్ రైతు వేదికలలో రైతులు, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో మండల ప్రత్యేక అధికారి చరణ్‌దాస్, తిర్మాలాపూర్ నోడల్ అధికారి, ఎంపీడీవో ఇ. స్వరూప, మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి, ఎంపీవో వెంకటేశ్వర్లు, మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గడ్డం జీవన్‌రెడ్డి, టెక్నికల్ అధికారులు దీప్తి, సింధు, పూడూర్, తిర్మాలాపూర్ సింగిల్ విండోల చైర్మనులు రవీందర్‌రెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

●మల్లాపూర్: మండలంలోని మొగిలిపేట, చిట్టాపూర్ గ్రామాల్లోని రైతు వేదికలకు నూతనంగా వీడియో కాన్ఫరెన్స్‌లు మంజూరు కాగా సోమవారం వ్యవసాయాధికారులు, నాయకులు ప్రారం భించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని మల్లాపూర్‌తో పాటు మూడు గ్రామాల రైతువేదికల్లో జరిగిన ప్రత్యక్ష ప్రసారాలను పలువురు రైతులు వీక్షించారు.

●వెల్గటూర్: రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు వ్యవసాయ విజ్ఞానం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి సాయి కిరణ్ పేర్కొన్నారు. వెల్గటూర్, చెగ్యాం రైతు వేదికలలో ' రైతు నేస్తం' కార్యక్రమం ఏర్పాటు చేశారు. దృశ్య శ్రవణ పరికరాల ద్వారా ముఖ్యమంత్రి సందేశాన్ని రైతులకు వినిపిం చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జయ్‌సింగ్, ఎంపీడీవో వెంకటేశ్వర్ రావు, పీఏసీఎస్ చైర్మన్ గోలి రత్నాకర్, ఏఈవోలు ఫిర్‌దోజ్, స్రవంతి, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి, గుండాటి సందీప్‌రెడ్డి, అనుమాల మంజుల, బొప్ప తిరుపతి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కోరుట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోని అంటు వ్యాదలను నివారించాలని మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్ సూచించారు. ఒక మార్పు - అభివృద్ధికి మలుపు వంద రోజుల కార్యక్రమంలో బాగంగా పట్టణంలోని వివిధ వార్డులలో పారిశుద్ద్య పనులను కార్మికులు నిర్వహించారు. మురికి కాల్వలను శుభ్రపరిచి ఇండ్లలో నిలువ ఉన్న నీటీని తొలగిం చారు. కార్యక్రమంలో సానిటరి ఇన్‌స్పెక్టర్ అశోక్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రులను కలిసి జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన నూతన మంత్రులను సోమవారం జువ్వాడి కృష్ణారావు మర్యాద పూర్వకంగా కలిసారు. హైదరాబాదులోని సచివాలయంలో మంత్రులు వివేక్ వేంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరిలను కలిసి శాలువాలతో సత్కరించి అభినందించారు. స్థాని కంగా పార్టీ పని తీరుతో పాటు నిర్వహిస్తున్న అభివృద్ధి పనులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిపాల్ రెడ్డి, రాజోజీ సదానంద చారీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

'నిరు పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం'


సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కోరుట్ల రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల అండగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని మార్కెట్ కమిటిలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగ రావుతో కలిసి ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయనిధి పథకంలో మంజూరైన లబ్ధిదారులకు చెక్కులను అందించారు. 34 మంది లబ్ధిదారులకు రూ. 13.60 లక్షల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చేక్కులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ పన్నాల అంజిరెడ్డి నాయకులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, సత్యనారాయణ గౌడ్, దశరథం, లింబాద్రి, సురేష్ గౌడ్, అడెపు మధు, పుప్పాల ప్రభాకర్, ఎంబేరి నాగభూషణం పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

కోరుట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారుల ప్రోత్సాహం కోసం ప్రభుత్వం క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తుందని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణం శివారులోని వెటర్నటీ కళాశాల సమీపంలో క్రీడా మైదానం కోరకు ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల స్థలంను కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగరావుతో కలిసి పరిశీలించారు. స్థానికంగా ఉన్న క్రీడాకారులను గుర్తించి కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగ రావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకపోయి స్థలం కేటాయిం చడానికి కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

రాయికల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన పలువురు పేద కుటుంబాలకు సోమవారం దుబాయ్ వారధి సంఘం ఆర్థిక చేయూతనందించింది. గ్రామానికి చెందిన బద్దినపెల్లి గంగరాజు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు, చింతకుంట రాజేందర్ అనే యువకుడు అనా రోగ్యంతో బాధ పడుతుండగా ఆయన కుటుంబసభ్యులకు అండగా నిలిచారు. గంగరాజం కుటుంబానికి రూ.15,500, రాజేందర్ కుటుంబానికి రూ.11 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకటేశ్వర్లు, వాసరి రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకలు పంపిణీ

రాయికల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడి లేని విద్య ప్రభుత్వ పాఠశాలలోనే సాధ్యమని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్ అన్నారు. రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలకలను పంపిణీ చేశారు. అనంతరం సాముహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్‌సీలు మ్యాకల రమేష్, బత్తిని భూమయ్య, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేష్, కోశాధికారి కట్ల నర్సయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు కట్కం కళ్యాణ్, కొత్తపెల్లి రంజిత్, బెక్కెం తిరుపతి, ప్రధానోపాధ్యాయుడు గట్టు రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

బుగ్గారం, జూన్16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం హయంలోనే మండల అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్ అన్నారు. గంగాపూర్ వయా యశ్వంత రావుపేట్ బుగ్గారం వరకు నిర్మిస్తున్న బీటు రోడ్డు పనులను స్థానిక నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ గత ప్రభుత్వం లో రెండుసార్లు శిలాఫలకాలను ఆవిష్క రించారు తప్ప పనులు ప్రారంభిం చలేదని అన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు నగునూరి నర్సగౌడ్, మాజీ సర్పంచులు తాండ్ర సత్యనారాయణ రావు, కొండపల్లి సంతోష్ రావు, నాయకులు ఉరిమేట్ల సంతోష్ పాల్గొన్నారు.